క్లుప్తంగా

సీడీపీవోగా సిమ్మలమ్మ

సీతంపేట: స్థానిక ఐసీడీఎస్ సీడీపీవోగా సిమ్మలమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. పాలకొండ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన రంగలక్ష్మి పాలకొండకు బదిలీ అయ్యారు. సీతంపేటలో సూపర్‌వైజర్‌గా వెంకటలక్ష్మి, యూడీసీగా చంద్రశేఖర్ జాయిన్ అయ్యారు. మరో ఇద్దరు సూపర్‌వైజర్లు ఇంకా జాయిన్ కావాల్సి ఉంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జియ్యమ్మవలస రూరల్: కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖాధికారి బి.శంకరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. 33 కేవీ మేరంగి లైన్ నిర్వహణ, విద్యుత్ తీగలను తాకే చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

భామినిలో..

భామిని: మండలంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ బి.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భామిని ఫీడర్ 33 కేవీ లైన్‌లో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీరఘట్టం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న బిటివాడ ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో ఉన్న ఎం.రాజపురం, హుస్సేనుపురం, గదబవలస, కుంబిడి, కత్తులకవిటి, రేగులపాడు, తూడి, యు.వెంకమ్మపేట, కొట్టుగుమ్మడ, గడగమ్మ, చిదిమి, పాలమెట్ట గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.

పాఠశాలలకు చేరని దుస్తులు

సీతానగరం: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు సమకూర్చాల్సిన సామగ్రి అందించడంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం విఫలమైంది. విద్యా సంవత్సరం ప్రారంభించే సమయానికి విద్యార్థులకు దుస్తులు, షూస్, సాక్స్‌లు, ప్లాంక్‌లు, పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం వంటలకు అవసరమైన బియ్యం విద్యా సంవత్సరానికి ముందే అప్పటి ప్రభుత్వం సమకూర్చింది. తాజాగా కూటమి ప్రభుత్వం విద్యార్థులకు సన్న బియ్యం ఇస్తామన్నారు. బ్యాగ్ పేరులో సన్న బియ్యం అని ఉన్నా.. లోపల బియ్యం చూస్తే తేడా కనిపిస్తోంది. అలాగే విద్యార్థులకు దుస్తులు రాలేదు. షూస్ రాలేదు. ప్లాంక్‌లు రాలేదు.

గమ్యానికి సురక్షితంగా చేరుకోవాలి



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ

పార్వతీపురం రూరల్: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేరుకోవాలని పార్వతీపురం పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు పేర్కొన్నారు. పట్టణ శివారులోని అంతర్రాష్ట్ర రహదారిలో వాహన చోదకులకు గురువారం అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు పరిమితికి మించి ప్రయాణించొద్దని, హెల్మెట్ విధిగా ధరించాలని సూచించారు. అతివేగంతో ప్రమాదమని గుర్తించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ ఎస్ఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రపై సమీక్ష

మక్కువ: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఇంచార్జ్ ఎంపీడీవో పి.దేవకుమార్ అన్నారు. స్థానిక సచివాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ శనివారం ఎంపిక చేయబడిన కేంద్రాలలో యోగాసనాలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. పంచాయతీ కార్య నిర్వహణ అధికారి బి.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పురపాలక సంఘ సర్వసభ్య సమావేశాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు పొందుపరిచిన అజెండాలో 23 మంది ఆప్కాస్ ఉద్యోగులను తొలగించాలన్న అంశాన్ని తొలగించాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ అంగీకరించకపోవడంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. ఈ మేరకు చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి సమావేశాన్ని వాయిదా వేశారు.

అయోమయంలో ఇంటర్ సెకండియర్ విద్యార్థులు



సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల

- హైస్కూల్ ప్లస్ టు ఎత్తివేతకు రంగం సిద్ధం
- ఫస్టియర్ ప్రవేశాల్లేవు.. సెకండియర్ తరగతుల్లేవు..
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

సీతంపేట: కార్పొరేట్ తరహాలో విద్యనందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హైస్కూల్ స్థాయిలో ప్లస్ టూను ఏర్పాటు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీన్ని నిర్వీర్యం చేసే విధంగా అడుగులు వేస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతంపేట హైస్కూల్‌లో ఆరు నుంచి 10 తరగతులు నిర్వహిస్తుండగా అదనంగా గత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రవేశాలు జరిపారు. ఇందులో మొత్తం 59 మంది విద్యార్థులు చేరారు. ఎంపీసీలో 22, బైపీసీలో 37 మంది చదువుతున్నారు. వీరంతా మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించారు. ఈ సంవత్సరంలో సెకండియర్‌కు వస్తారు. ఈ నెల 1వ తేదీ నుంచి అన్ని జూనియర్ కళాశాలల్లో తరగతులు ప్రారంభమైనప్పటికీ ఇప్పటికీ ఇక్కడ క్లాసులు ప్రారంభం కాలేదు. విద్యార్థులు రోజూ పాఠశాలకు వచ్చి వెళ్లడం తప్పితే తరగతులు జరగడం లేదు. దీంతో తరగతులు ఎప్పుడు జరుగుతాయా.. అని ఎదురు చూస్తున్నారు. ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఇటు తల్లిదండ్రులు, వారి పిల్లలు సతమతమౌతున్నారు. ఏడాది పాటు ఇక్కడ చదివి వేరే కళాశాలలో చేరాలంటే మళ్లీ అంత కొత్తే అవుతుందని వాపోతున్నారు. ఇక్కడ తరగతులు నిర్వహించకపోతే వేరే చోటకు వీరందరినీ చేర్పించాలని ఉన్నతాధికారుల నుంచి కూడా ఎటువంటి ఆదేశాలు రాకపోవడం గమనార్హం.

ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాలి

ఇక్కడ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం కొనసాగింపు విషయమై తమ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. సెకండియర్ విద్యార్థులకు ఉన్న హైస్కూల్ సిబ్బందితో పాఠాలను బోధించడానికి చర్యలు తీసుకుంటాం.

– వి.వెంకటరావు, హెచ్ఎం, జీహెచ్ఎస్, సీతంపేట

రిలీవైన టెస్ట్ విద్యార్థులు

వాస్తవానికి ఇక్కడ చదివిన టెస్ట్ పాసైన విద్యార్థులను ఇంటర్మీడియట్‌కు ప్రమోట్ చేయాల్సి ఉంది. అయితే ఇంటర్మీడియట్ కోర్సు ఎత్తివేయనుండడంతో ఉన్న వారికి ప్రమోట్ చేయలేదు. కొత్తవారిని తీసుకోని పరిస్థితి ఉంది. ముఖ్యంగా చాలినన్ని వసతులు లేకపోవడం, అలాగే ప్రాక్టికల్ మెటీరియల్‌తో పాటు ప్రత్యేక గదులు ఉండాలి. అవేవి లేవు. వీటన్నింటికంటే ముందు సబ్జెక్టు టీచర్లు కూడా ఉండాలి.. వారిని నియమించలేదు. ఈ క్రమంలో ప్లస్ టూను ఎత్తివేసే విధంగా అధికారులు చర్యలకు ఉపక్రమించనున్నట్టు సమాచారం.

అధ్వానంగా మీనకోట రహదారి



వాకాలమ్మ ఆలయం నుంచి మీనకోట రహదారి ఇలా..

పాలకొండ రూరల్: మండలంలోని బద్దుమాసింగి సమీప గిరిజన గ్రామం మీనకోట. ఈ గ్రామానికి వెళ్లే రహదారిలో సమస్యలు తలెత్తాయని అక్కడి గిరిజనులు వాపోతున్నారు. అక్కడి వాకాలమ్మ ఆలయం నుంచి దాదాపు అర కిలోమీటరు వరకూ ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా వర్షాలకు దెబ్బతిందని, దీని కారణంగా వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నట్టు గిరిజనులు చెబుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో వర్ష ప్రభావం అధికమైతే కనీసం నడిచేందుకు కూడా అవకాశం ఉండదని ఆందోళన చెందుతున్నారు. మండలంలో శివారు గ్రామం కావటంతో అధికారుల పర్యవేక్షణ లేక అవస్థలు పడుతున్నట్టు పేర్కొంటున్నారు. తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటలను పారబోస్తున్న పోలీసులు

వీరఘట్టం: మండలంలోని కుంబిడి – ఇచ్ఛాపురం పంచాయతీ పరిధిలో ఉన్న బల్లగుడ్డి గిరిజన గ్రామ శివారులో 1400 లీటర్ల బెల్లం ఊటను గురువారం ధ్వంసం చేసినట్టు ఎస్.ఐ జి.కళాధర్ తెలిపారు. సారా తయారీ చేస్తున్నట్టు వచ్చిన సమాచారంతో తమ సిబ్బందితో దాడులు చేయగా తయారీదారులు పరారయ్యారని తెలిపారు. పరారైన వారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు ఎస్.ఐ తెలిపారు. బెల్లం ఊటలను పారబోసి సారా తయారీకి ఉపయోగించిన ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ పరిశినాయుడు

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ బొంగు పరిశినాయుడు చేతులమీదుగా విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు అందజేశారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

బాధ్యతల స్వీకరణ

గుమ్మలక్ష్మీపురం: ఎంపీడీవోగా పి.త్రివిక్రమరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా చేసిన ఎస్.సాల్మన్‌రాజుకు అల్లూరి సీతారామరాజు జిల్లా, దేవీపట్నం మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో త్రివిక్రమరావు వచ్చారు. ఈ మేరకు విధుల్లో చేరిన ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పీవోగా కె.విజయగౌరి గురువారం బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా గ్రామదేవత సంబరాలు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని బొమ్మిక గ్రామంలో గ్రామదేవత కంచెమ్మ సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా అమ్మవారికి విశేష పూజలు చేశారు. పంటలు బాగా పండాలని వేడుకున్నారు. అనంతరం గ్రామదేవత విగ్రహాన్ని ఊరేగించారు.

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడ హారతి తదితర కార్యక్రమాల అనంతరం భక్తులకు బాబా దర్శనం కల్పించారు.

● చినుకుపడితే చిత్తడే..



సమస్యలు పరిష్కరించండి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ ఓ ప్రకటనలో గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల వసతిగృహాల్లో నెలకొన్న వంటశాలలు, ఆరోగ్య కార్యకర్తలు, వర్కర్లు, ప్రహరీల సమస్యలు తీర్చడంతో పాటు ఉపాధ్యాయుల భర్తీ చేట్టాలని, విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

తోటపల్లి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్: తోటపల్లి బ్యారేజి నిర్వాసితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడారు. తోటపల్లి నిర్వాసితుల పెండింగ్ సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. దీంతో నిర్వాసితుల్లో ఆందోళన నెలకొందన్నారు. నిర్వాసితులైన 1500 మందికి ఇళ్ల నిర్మాణ బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదని ధ్వజమెత్తారు. కొన్ని నిర్వాసిత గ్రామాలకు నేటికీ మౌలిక సదుపాయాలు కల్పించలేదని పేర్కొన్నారు. దీంతో నిర్వాసిత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. నిర్వాసితుల సమస్యలు కూటమి పాలకులకు పట్టడం లేదని అన్నారు. నిర్వాసితుల పెండింగ్ సమస్యలు తక్షణమే కూటమి పాలకులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో రైతు సంఘం నాయకులతో జియ్యమ్మవలస మండలం బిత్రపాడు, నిమ్మలపాడు తదితర గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో గిరిజనులకు చేసింది శూన్యం

పార్వతీపురం: ఏడాది కూటమి పాలనలో ప్రభుత్వం గిరిజనులకు చేసింది శూన్యమని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ విమర్శించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పింఛన్ లాంటివి అందరితో పాటు గిరిజనులకు వస్తున్నాయే తప్పితే గిరిజనులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా చేసిందేమీ లేదన్నారు. 1/70 చట్టాన్ని సవరించి గిరిజనులకు భూములపై హక్కు లేకుండా చేసే కుట్రలు ప్రభుత్వం చేస్తుందన్నారు. ట్రైకార్ ద్వారా గిరిజనులకు ఎలాంటి రుణాలు మంజూరు చేయలేదన్నారు. జీసీసీ ద్వారా గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించలేదన్నారు. కనీసం పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు రెగ్యులర్ పీవోలను కూడా నియమించలేదని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పార్వతీపురం రూరల్: మండలంలోని జమదాల – బందలుప్పి గ్రామాల మధ్య ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలైనట్టు అవుట్‌పోస్టు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు తెలిపిన వివరాలు.. గురువారం జమదాల గ్రామానికి చెందిన కొర్ర శంకరరావు ద్విచక్ర వాహనంపై బందలుప్పి వెళ్తుండగా ఇదే గ్రామం నుంచి ఎదురుగా వస్తున్న వీరభద్రపురం గ్రామానికి చెందిన ఎక్కంశెట్టి గణేష్ ఢీకొనగా శంకరరావు కుడి కాలుకు స్వల్ప గాయాలు కాగా గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అటుగా వెళ్తున్న వాహనంలో ఇరువురిలో ఒకరిని జిల్లా కేంద్ర ఆసుపత్రికి, మరొకరిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై వివరాలు నమోదు చేసినట్టు అవుట్‌పోస్టు ఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు తెలిపారు.

ఏం మంచి చేశారని వేడుకలు చేసుకుంటారు?



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

గుమ్మలక్ష్మీపురం: అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఎవరి ఏం మంచి చేశారని వేడుకలు చేసుకునేందుకు సిద్ధమైపోతున్నారని కూటమి నాయకులను సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని గిరిజన సంఘ కార్యాలయంలో ఆ పార్టీ మండల కమిటీ నాయకులు ఎం.రమణ, ఎం.శ్రీనివాసరావు, ఎం.సన్యాసిరావు, బి.శంకరరావులతో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఎండీయూ వాహనాలు రద్దు చేశారని, దీంతో గిరిశిఖర గ్రామాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే రిజర్వాయర్లు, చెక్‌డ్యామ్‌లు నిర్మించకపోవడం వల్ల రైతులు సాగునీటి కష్టాలు పడుతున్నారన్నారు. కొత్త విద్యాసంవత్సరం ఆరంభమైనా నేటికీ గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తికాలేదన్నారు. ఇప్పటికీ ఆ కళాశాల నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమిస్తామని సాక్షాత్తు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చెప్పారని, ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు లేవన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం కూడా అంతంతమాత్రంగానే అందుతోందన్నారు. జీవో నంబరు 3 పునరుద్ధరిస్తామని, అమెరికా కంపెనీల్లో ఉపాధి కల్పించే చర్యలు తీసుకుంటామని, గిరిజనులకు స్పెషల్ డీఎస్సీ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో హామీలు ఇచ్చారని ఆ హామీలన్నీ ఎప్పుడు నెరవేరుస్తారని ధ్వజమెత్తారు. పూర్ణపాడు–లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేస్తాం.. ఏనుగులు తరలిస్తామన్నారని అవేవీ చేయడం లేదన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని హితవు పలికారు.

వీవోఏలకు శిక్షణ



శిక్షణకు హాజరైన వీవోఏలు

జియ్యమ్మవలస రూరల్: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘాల బలోపేతం, మండల సమైక్య సంస్థల నిర్మాణంపై వీవోఏలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. లోకాస్ యాప్ ద్వారా ఆన్‌లైన్ డేటాసేకరణ, సంఘాల అభివృద్ధి, ఆర్థిక లావాదేవీలు,నాయకత్వ లక్షణాలువంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు పల్లె రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మినీ గొడౌన్



ప్రారంభానికి ఎదురు చూస్తున్న లివిరిలోని మినీ గొడౌన్

భామిని: మండలంలోని లివిరిలో నిర్మించిన మినీ గొడౌన్ ఉపయోగించక నిరుపయోగంగా తయారైంది. భామిని సహకార సొసైటీ పరిధిలో రైతులు పండించిన పంటలను విక్రయించే వరకు నిల్వ చేసుకునేందుకు నిర్మించిన ఈ గొడౌన్ పూర్తి హంగులతో సిద్ధంగా ఉంది. గత ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా దీన్ని నిర్మించింది. లివిరిలో రూ.25లక్షల వ్యయంతో దీన్ని నిర్మించినా ప్రయోజనం లేకుండా పోయింది.

అన్నదాత సుఖీభవకు బయోమెట్రిక్ తప్పనిసరి

పాలకొండ: కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు అందించే ఆర్థిక సాయానికి సంబంధించి పలు నిబంధనలు విధించింది. రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ వేయాలన్న నిబంధన విధించింది. గతంలో రైతులు అందుబాటులో లేకపోయినా ఫోన్‌లో ఓటీపీ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వం ఓటీపీ అవకాశం కల్పించలేదు. దీంతో దూర ప్రాంతాల్లో ఉన్న రైతులు ఈ పథకం పొందాలంటే అవస్థలు పడుతున్నారు. దీనిపై రైతు సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయం కూడా ఎక్కువగా లేదని ఓటీపీ అవకాశం కల్పించాలని రైతు సంఘం నాయకులు కండాపు ప్రసాదరావు కోరారు. బయోమెట్రిక్ విధానం ద్వారానే పథకం అమలు చేస్తే 30శాతం మంది రైతులు అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. దీనిపై ఏవో వై.వాహిని మాట్లాడుతూ ప్రస్తుతం ఓటీపీ విధానం అమలు లేదని, రైతులు సంబంధిత ఆర్ఎస్‌కేలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుతో విద్యుత్ ఆదా



పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్న సీసీ తిరుపతిరావు

గరుగుబిల్లి: పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేస్తే విద్యుత్ ఆదా అవుతుందని సీసీ తిరుపతిరావు తెలిపారు. మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి గ్రామాల్లో వెలుగు మహిళా సభ్యులు, సిబ్బందితో గురువారం సమావేశమై పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా కిలోవాట్‌కు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, వినియోగించగా మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. రాయితీపై సోలార్ ప్యానెళ్లు ఇవ్వడం జరుగుతుందని మిగిలిన వాటా చెల్లించేందుకు బ్యాంకు రుణం పొందే అవకాశం కూడా ఉందన్నారు. సంఘ సభ్యులు గౌరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన డిప్యూటీ ఈవో



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న డిప్యూటీ ఈవో, ఎంఈవో తదితరులు

పాలకొండ రూరల్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో డిప్యూటీ ఈవో పి.కృష్ణమూర్తి, ఎంఈవో కె.సోంబాబు పట్టణ, మండల పరిధిలో పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. అక్కడి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈవో మాట్లాడుతూ మొత్తం 61 పాఠశాలలు ప్రారంభమయ్యాయన్నారు. దాదాపు 4వేల పైచిలుకు విద్యార్థులకు పుస్తకాలు అందించటం జరిగిందన్నారు. యూనిఫాంలు, షూలు, బ్యాగ్‌లు ఇతర సామగ్రి రావాల్సి ఉందన్నారు. పట్టణ పరిధిలో వెంకమ్మపేట, హడ్కో కాలనీ పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసినట్టు తెలిపారు. మండలంలో 10 ప్రాథమిక పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా పదోన్నతి చెందినట్టు వివరించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా బడిబాట పట్టాలని సూచించారు.

దెబ్బతిన్న ఏబీ రోడ్డు



కాట్రగడ-బీ వద్ద రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

భామిని: మండలంలోని ఏబీ రోడ్డు మరమ్మతులకు గురైంది. గురువారం కురిసిన కొద్దిపాటి వర్షానికే ఏబీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. కూటమి పాలనలో ఇటీవల రహదారులు మరమ్మతులు చేపట్టారు. అయితే మరమ్మతులు చేసిన నెలల రోజులకే రోడ్లు దెబ్బతింటున్నాయని చెప్పడానికి ఈ రహదారిని ఉదాహరణగా చెప్పొచ్చు. బాగున్న రహదారులను సైతం జేసీబీలో ధ్వంసం చేసి మరమ్మతుల పేరిట కూటమి నేతలకు పనులు అప్పగిస్తున్నారు. గురండి నుంచి కాట్రగడ బీ వరకు బాగున్న తారు రోడ్డును పీకేసి మెటల్ వేసి విడిచిపెట్టారు. నెలలు దాటుతున్నా రోడ్డు వేయడం లేదు. దీంతో ఈ రోడ్డులో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారుల మస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: మండలంలోని సుంకి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో జి.పైడితల్లి గురువారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్లు చూసి పనిలోకి వచ్చిన వారికే మస్టరు వేయాలని సూచించారు. అలాగే కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందని వేతనదారులకు తెలిపారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులకు ఉపయోగపడే పనులు ఉపాధి పథకం పనుల్లో చేయాలన్నారు.